# సాకేత రామాయణం

(గేయ కావ్యం)



గజానన్ తామన్

మహారాష్ట్ర కవి

**గజానన్ దిగంబర్ మాడ్గూళ్కర్**

గీత్ రామయణ్ కు అనుసృజన

శ్రీ సీతారామ సేవాసదన్

మంథని

జి॥ కరీంనగర్ (ఆం.ప్ర.)

# సాకేత రామాయణం

(గేయ కావ్యం)


**గజానన్ తామన్**


మహారాష్ట్ర కవి

**గజానన్ దిగంబర్ మాడ్గూల్కర్**

గీత్ రామాయణ్‌కు అనుసృజన


ప్రచురణ :

**శ్రీ సీతారామ సేవాసదన్**

**మంథని.**

జి॥ కరీంనగర్ (ఆం.ప్ర.) 505 184.

ఏప్రిల్ 2, 2009

# SAKETA RAMAYANAM

(In Fifty Two Lyrics)

by : GAJANAN GUNAWANTRAO TAMAN

Source : **GEET RAMAYAN**
(Marathi)

by : GAJANAN DIGAMBAR MADGULKAR

First Edition : April, 2, 2009
Ramanavami

© KU. NAYANA JAYANT TAMAN

Copies : 1000

Rs. 100/-

Publishers :
SRI SITA RAMA SEVA SADAN
MANTHANI - 505 184.
Dist. Karimnagar (A.P.) Ph: 08729-258439

Graphics & Cover Design :
Ch. Shiva Prasad

Printed at :
Satyanarayana Offset Printers
Tilak Road, KARIMNAGAR. (A.P.)
Ph: 0878-2243026



# అనుక్రమణిక


- ప్రకాశకీయం : శ్రీ సువర్ణ లక్ష్మణ్‌రావు ........ i
- సౌమిత్రం : ప్రొ. శ్రీ లక్ష్మణమూర్తి ........ iii
- తెలుగు కోయిల : డా. గంట్ర లక్ష్మణరావు ........ x
- మనోగతం ........ xix


## గేయ క్రమము

**బాలకాండ :**


1. నివేదకుడు ........ 1
2. సాకేతవాసి ........ 3
3. కౌసల్య ........ 5
4. దశరథ మహారాజు ........ 7
5. యజ్ఞపురుషుడు ........ 9
6. సాకేతనారీజనం ........ 11
7. కౌసల్య ........ 13
8. విశ్వామిత్రుడు 1 ........ 15
9. విశ్వామిత్రుడు 2 ........ 18
10. ఆశ్రమవాసి ........ 20
11. అహల్య ........ 22
12. వందిమాగధులు ........ 24
13. ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి ........ 26


**అయోధ్యకాండ :**


14. కైకేయి ........ 28
15. కౌసల్య ........ 31
16. లక్ష్మణుడు ........ 33
17. సీత ........ 35
18. సాకేతజనులు ........ 37


**అరణ్యకాండ :**


19. గుహుడు ........ 39
20. శ్రీరాముడు ........ 41
21. సుమంతుడు ........ 43
22. దశరథ మహారాజు ........ 45
23. భరతుడు ........ 47
24. లక్ష్మణుడు ........ 49
25. శ్రీరాముడు ........ 51
26. భరతుడు ........ 54
27. శూర్పణఖ 1 ........ 56
28. శూర్పణఖ 2 ........ 58
29. సీత 1 ........ 61
30. సీత 2 ........ 63
31. శ్రీరాముడు 1 ........ 65
32. శ్రీరాముడు 2 ........ 68
33. జటాయువు ........ 70
34. శబరి ........ 72


**కిష్కింధాకాండ :**


35. సుగ్రీవుడు ........ 74
36. శ్రీరాముడు ........ 76


**సుందరకాండ :**


37. జాంబవంతుడు ........ 78
38. హనుమానుడు ........ 80
39. సీత 1 ........ 83
40. సీత 2 ........ 85
41. నివేదకుడు ........ 87


**యుద్ధకాండ :**


42. వానరగణము ........ 89
43. శ్రీరాముడు ........ 91
44. అంగదుడు ........ 94
45. నివేదకుడు ........ 96
46. శ్రీరాముడు ........ 98
47. కుంభకర్ణుడు ........ 100
48. గంధర్వులు ........ 102
49. శ్రీరాముడు 1 ........ 104
50. శ్రీరాముడు 2 ........ 106
51. సాకేతజనులు ........ 108
52. హనుమానుడు ........ 111

# ప్రకాశకీయం

**మా**నససరోవరం రచయిత, మా సంస్థకు అత్యంతసన్నిహితుడు అయిన శ్రీ గజానన్ తామన్ అనుసృజనగా రచించిన సాకేత రామాయణం ఒక మనోజ్ఞ గేయకావ్యం. ఇందులో ఏబది రెండు గేయాలున్నవి. ఈ గేయాలు వివిధ రగడజాతికి చెందినవి. ఘటనాక్రమాన్ని నిర్వహించే గద్యం లేదు. కథాసూత్రంతో పాటు పాత్రలే మనోభావాల్ని గేయరూపంలో వ్యక్తం చేస్తవి.

మేము మీకు సంప్రతి అందిస్తున్న సాకేత రామాయణం మహారాష్ట్రకు చెందిన మహాకవి గజానన్ దిగంబర్ మాడ్గూళ్కర్ గారి 'గీత్ రామాయణ్' కు ఒక వైదుష్యపూర్ణమైన అనుసృజన. తెలుగు సాహిత్యంతోపాటు మరాఠీ సాహిత్యంతో ప్రగాఢపరిచయం కలవాడై నందున రచనాకార్యాన్ని శ్రీ గజానన్ ప్రశంసనీయంగా నిర్వహించారు. కావ్యసృష్టి గజాననునిదే; ప్రతిసృష్టి గజాననునిదే! రామకథను మరాఠీ తెలుగు భాషలలో కావ్యాలుగా మలచిన ఉభయులూ గజానన నామధేయులు కావటం దుగ్ధశర్కరాయోగం.

జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి 'ఉదయశ్రీ'లోని పద్యాల్ని గాంధర్వ విద్యాపారంగతుడు ఘంటసాల పాడి, ఆంధ్రదేశాన ఆచంద్రార్కం మనేటట్లు చేశాడు. అలాగే గజానన్ దిగంబర్ మాడ్గూళ్కర్ 'గీత్ రామాయణ్' లోని గేయాలకు శ్రీ సుధీర్ ఫడ్కే లోకోత్తరసంగీతాన్ని కూర్చటంతోపాటు, మహారాష్ట్రీయమానసాల దోచే విధంగా పాడి అజరామరం చేశాడు.

మనవాడైన శ్రీ గజానన్ తామన్ ప్రతిభావ్యుత్పత్తులు గల ఉత్తమకవి. తెలుగునాట గల ప్రముఖకవు లందరికీ ఆయన సుపరిచితులు. జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన డా. సి. నారాయణరెడ్డి గారి ప్రశంసాపాత్రుడైన కవి. పీఠాపురంలో డా॥ సోమసుందర్ గారి నుండి సన్మానాన్ని పొందిన భాగ్యశాలి. గట్టు నారాయణ గురూజీకి అత్యంతప్రీతిపాత్రు లైన వ్యక్తులలో ఒకడు. బహుభాషలతో పరిచయం కలవాడు. ఎందరి రచనలనో, కావ్యములనో పత్రికలలో సమీక్షించాడు. ఈయన కావ్య మైన మానససరోవరంపై ఎందరో సమీక్షలు వ్రాశారు.



సాకేత రామాయణం మూలవిధేయ మైన అనువాదం కాదు. అనుసరణ అనటానికి కూడా వీలు పడదు. మాడ్గూళ్కర్ గారి గీత్ రామాయణ్‌ను ఒక స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసికొని అద్భుతమైన అనుసృజనగా రూపొందించాడు శ్రీ గజానన్.

శ్రీ సీతారామసేవాసదన్ మానససరోవరం కావ్యాన్ని డా॥ వి.వి.ఎల్. నరసింహారావు గారి 'హంసధ్వని'ని చేర్చి ప్రచురించిన నాలుగేండ్ల తరువాత ఈ కావ్యాన్ని తెలుగు పాఠకులకు అందిస్తున్నాము.

విషయాంతరమైనా, మరో వాస్తవాన్ని పాఠకులకు తెలుపడం అనివార్యంగా భావిస్తున్నాను. శ్రీ గజానన్ తామన్ గారు ఎనలేని అంకితభావంతో సువిఖ్యాతులైన గట్టు నారాయణ గురూజీ గారి శతాధిక ఆంగ్లరచనలనుండి నాల్గింటిని ఎన్నుకొని తెలుగులోనికి అనువదించారు. మా సంస్థ ప్రచురించి వినామూల్యం వితరణ చేసింది.

సాకేత రామాయణం వంటి ఉత్తమకావ్యాన్ని రచించిన శ్రీ గజానన్ తామన్‌కు మా హార్దిక అభినందనలు.

ఈ కావ్యానికి వైదుష్యపూర్ణమైన పీఠిక వ్రాసిన డా॥ శ్రీ లక్ష్మణమూర్తి గారికి రచయితతో పాటు సంస్థ తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

అలాగే, విద్వన్మిత్రులు డా॥ గంద్ర లక్ష్మణరావు ఈ కావ్యానికి 'తెలుగు కోయిల' అందించి నందులకు ఋణనిర్దేశం చేయడం కర్తవ్యంగా భావిస్తున్నాను.

ఈ కావ్యాన్ని అందముగా ముద్రించి ఇచ్చిన శ్రీ జక్కని ప్రభాకర్ గారికి, అక్షరసంరచన చేసిన శ్రీ సి.హెచ్. శివప్రసాద్ కు మా హార్దిక అభినందనలు.

మా సంస్థ ప్రచురించిన అనేక గ్రంథాలతో పాటు, దీనిని పాఠకు లాదరిస్తారని ఆశిస్తున్నాను.

శుభం భూయాత్

**శ్రీ సీతారామసేవాసదన్**
**మంథని - 504 184.**
**జి॥ కరీంనగర్.**

భవదీయుడు
**సువర్ణ లక్ష్మణ్‌రావు**
అధ్యక్షుడు

శ్రీరామ నవమి
02-04-2008

**ప్రొ॥ యస్. లక్ష్మణమూర్తి** (రిటైర్డ్)
5-11-674, విద్యారణ్యపురి, వరంగల్లు-9
(మొ) 9959876675

# సౌమిత్రం

మహాకవి గజానన్ దిగంబర్ మాడ్గూళ్కర్ మహారాష్ట్ర భాషలో విరచించిన సుప్రసిద్ధమైన గీత్ రామాయణ్ అనే కృతికి అనుసృజనగా శ్రీ గజానన్ తామన్ తెలుగులో సాకేత రామాయణాన్ని ప్రతిభాపరిపూర్ణంగా తీర్చినారు. ఇదొక విశిష్టకృతి.

శ్రీ గట్టు నారాయణ గురూజీ ద్వారా శ్రీ తామన్ గారితో పరిచయం కలిగింది. శ్రీ గురూజీ గ్రంథాలకు తెలుగు అనువాదం చేసిన శ్రీ తామన్ వచన రచన పండిత ప్రశంసనల నందుకొన్నది. ఆయన 'మానస సరోవరం' శ్రీ తామన్‌ని ప్రముఖకవిగా ఆంధ్రదేశానికి పరిచయం చేసింది. మనసా, కర్మణా వేదాంతి యైన శ్రీ తామన్ కఠోపనిషత్తును పద్యాల్లో తెలుగు చేసినారు. వచనం, గేయం, పద్యం - ఈ మూడింటా నైపుణ్యం కలిగిన శ్రీ తామన్ ఆంధ్రాంగ్లమరాఠీభాషల్లో నిష్ణాతుడు. ఇంగ్లీష్ భాషాప్రాచార్యుడుగా కొన్ని దశాబ్దాలు మహారాష్ట్రప్రాంతంలో నివసించిన శ్రీ తామన్‌కి ఆ ప్రాంతం ఆచారవ్యవహారాలు, సాహిత్యసంప్రదాయాలు, ఆ భాషావైదుష్యంతో పాటు కొట్టిన పిండిగా సుపరిచితాలు. సాకేత రామాయణంలో ఆయన బహుభాషాపాండిత్యం స్పష్టంగా గోచరిస్తుంది. ఇంగ్లీష్ సాహిత్యాధ్యయనం ఆయనకు తులనాత్మకపరీక్షా పాటవాన్ని పుష్కలంగా సంపాదించి పెట్టింది. రామాయణరచనకు కేవలపాండిత్యం పర్యాప్తంకాదు. విద్వత్తుతో కలిసి తగి నంత తపస్సు, అర్హమైన ఆభిజాత్యమూ అవసర మౌతాయి. 'సాకేతపతి మా ఆరాధ్యదైవ మని' తెల్పుతూ "నా బాల్యకౌమారదశలను రామకథాపరిమళాలు ప్రత్యూషపవనాల వలె పై కొన్నవి", అని వ్రాసినారు. తమ పితామహుని నుండి శ్రీరామపాదారవింద సేవానిరతి కుటుంబం నిండా కస్తూరికాపరిమళంలా ఎలా పరివ్యాప్తమైందో తమ "మనోగతం" లో వివరించినారు. శ్రీ తామన్ మానసికతపస్వి. సాకేతపల్లివాసి. సాకేత రామాయణమును వ్రాసినాడన్న అది అనివార్యమైన కేవలవిధినిర్వహణమే. మరాఠీమూలం లోని శబ్దార్థాల పరిణాహాన్ని గాఢంగా మననం చేసి వ్రాయబడిన కృతిగా సాకేత రామాయణం తెలుగులో అవతరించడానికి నాలుగేళ్ళ కాలం (2004-2008) పట్టింది.



గీత్ రామాయణ్ పేరులోనే ఛందం నిక్షిప్త మైంది. ఆ ఛందాన్ని పలుకుబడినీ రగడల రూపంలో రాగానుకూలంగా తెలుగున శ్రీ తామన్ నిబద్ధం చేసినారు. 'దేశి' పద్ధతి ఛందంగా రగడ, ఛందోగ్రంథాల్లో బహుధా వివరింపబడినా, తెలుగు కవిత్వంలో అది అక్కడక్కడ మొక్కుబడి గానే కన్పిస్తుంది. జానపదుల లోనే రాగయుక్త మైన రగడ సజీవంగా ఉన్నది. రగడరూపమైన ఛందోవైవిధ్యంతో సాకేత రామాయణాన్ని రూపొందించడం సాహిత్యపరంగా సాహసకృత్యమే. మరాఠీ గీత్ రామాయణాన్ని శ్రీ సుధీర్‌ఫడ్కే లోకోత్తరసంగీతసమవేతం చేసి "మహారాష్ట్రీయ మానసాల దోచే విధంగా పాడి అజరామరం" చేసినట్లే, ఎవరైనా మధురగాత్ర సంపన్నుడు సాకేత రామాయణం లోని వివిధరగడలను సంగీతవైవిధ్యంతో మేళవించి పాడి ప్రజాబాహుళ్యంలో ప్రచారం చేసి పాదు కొల్పితే ఒక ఛందోవిశేషం బలంగా ప్రతిష్ఠిత మౌతుంది.

"సాకేత రామాయణం మూలవిధేయమైన అనువాదం కాదు. అనుసరణ అనటానికి కూడా వీలుపడదు. మాడ్గూళ్కర్ గారి గీత్ రామాయణ్‌ని ఒక స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని అద్భుతమైన అనుసృజనగా రూపొందించినా రని" ప్రకాశకీయంలో తెల్పినారు. కవిగా తన స్వయంప్రతిపత్తిని పరిరక్షించు కోవడం అనుసృజనలోనే సాధ్య మౌతుందని శ్రీ తామన్‌కి తెలిసి నందుకే ఆయన సాకేత రామాయణాన్ని మూలవిధేయంగా పరిమితం చేసి బంధించ లేదు. దీన్ని తెలుగులో వెలసిన కావ్యంగానే చదువవలెనని సూచిస్తున్నారు.

తెలుగులో రామాయణాన్ని రచించడం ఎంతో సహజ మైన పని. అంతే క్లిష్ట మైంది కూడా. పద్యంలో, గద్యంలో, గేయంలో, స్త్రీల పాటల్లో, జానపదుల పదాల్లో, నిర్వచనంగా, నిరోష్ఠ్యంగా, జనప్రియంగా, కల్పవృక్షంగా రామాయణాన్ని తెలుగున ఆవిష్కరించిన మహానుభావులెందరో? రామాయణం తెలుగులో నిరంతరంగా నిరుపమానవైవిధ్యంతో నిర్మిత మౌతూనే ఉన్నది. భూతలంపై గిరిసరిత్తు లున్నంత దాక రామాయణం జేగీయమాన మౌతుందన్న పరమేష్ఠి పలుకు రిత్తవోతుందా? 'మరల నిదేల రామాయణ మ'న్న ప్రశ్నకు స్థానం లేకుండా అది తెలుగులో వెలుగుతూనే ఉంటుంది. నిలద్రొక్కుకోవాలంటే, అనిదంపూర్వమైన ఒక విశిష్టలక్షణాన్ని కావ్యానికి సంతరించాలి. అందుకే అది క్లిష్టమైనపని.

శ్రీ తామన్ రాగయుక్తమైన రగడలను వివిధంగా విరచించి, సాకేత

రామాయణాన్ని విశిష్టకృతిగా సంపన్నం చేసినారు. మరాఠీగీతలతికను తెలుగుతోట నాటినారు.

గీత్ రామాయణ్‌తో సాకేత రామాయణాన్ని పోల్చి చెప్పడం సాధ్యం కాదు. తెలుగులో కొన్ని పంక్తులను పరిశీలిస్తే మూలకృతిప్రాశస్త్యం తెలుస్తుంది.

శ్రీరామచంద్ర సన్నిధిలో కుశలవులు గానం చేస్తున్న సందర్భంలో, వారిని గూర్చి కవి

'ప్రతిభావైభవరసాలవనమున
రమ్యగీతికలు పాడే పికములు'

అంటూ రమ్యమైన ఉపమానాన్ని ప్రయోగించి, రాముని దృష్టికి వారు సాక్షాత్కరించిన విధాన్ని ఇట్లా తెల్పినారు.

'పురుషార్థములను చతురస్రమ్మున
పొదుగబడిన నిజజీవనపటమును'

కుశలవులు రామజీవనపటంగా ఉన్నారు. పురుషార్థచతుష్టయాన్ని చతురస్రంగా రూపించడం విశేషం.

ధర్మార్థకామమోక్షాల్లో ఏ ఒక్కటైనా పెరిగితే జీవితం వికృతమై నట్లే చతురస్రంలో ఏ భుజం పెరిగినా అది ఆకృతిని కోల్పోయినట్లే. పురుషార్థ నిర్వహణం ఎంత నిర్దుష్టమో, కష్టమో రెండు చిన్న వాక్యాల్లో సూచింపబడింది. చతుర్వేదాలు దశరథునికి నల్వురు పుత్రులుగా అవతరించినారని

'అచిరకాలమున శ్రుతులు పాపలై
పారాడును మీ యింట॥' అనే వాక్యం మృదువైంది. కువలయశ్యాముడైన రాముణ్ణి గూర్చి:

'అసితనలినము నొందె నెట్టుల
అష్టగంధపరీమళమ్ములు॥'

అన్న పంక్తులూ,



కౌసల్యమాటల్లో దశరథతనయులను
'నాల్గువెల్గులుగాదలంతును
నాదుభాగ్యము పద్యతుల్యము॥'

అను పంక్తులు మనోహరమైనవి. "పద్యతుల్యము" అంటే ప్రశంసార్హమనీ, పద్యము వంటి దనీ సూచన. పద్యంలో నాల్గు పాదాలు ఎట్లా సమానమో అట్లే వీరు నల్వురని చెప్పడం. అహల్య వాక్యాల్లో :

'చరణరజమే కేశవీథిని
చారుతరసిందూరమయ్యెను॥' చక్కగా కుదురుకున్నవి. ఆమె రామునితో ఇలా అంటుంది.

'అమరమానవకల్పభూజమ!
అర్ఘ్యపాద్యము లేల చెప్పుమ!
నీవొసంగిన జీవనమునే
నీదు పదముల నిడగ నెంచితి॥'

జీవన మంటే 'జీవితము, నీరు' అనే రెండు అర్థాలను మేళవించి, జీవనమే పాద్యంగా శ్రీరాముని కర్పిస్తా ననడం అందంగా ఉన్నది. మాయలేడి "మేని పసిడి ఇప్పపూలమెరుపుల కనువాదంగా" ఉన్న దనడం సున్నితమైన భావం.

శివధనుర్భంగం చేస్తున్న రాముణ్ణి సీత ఇలా చూచింది.

'దవ్వుల నుండే ముగ్ధవధువు వరధన్విని వీక్షించే
ఒప్పులకుప్పై ఓరకనులతో హొయలను ఒలకించే
బుగ్గలు సిగ్గున ఎరుపులు చిమ్మగ ముద్దుమోము వాంచే'

చక్కని లయ, సరళ మైన భాష పొందికగా కుదురుకొన్నాయి. ఆమెలో "బిడియము కొంచెము, బింకము కొంచెము" కన్పించింది.

శ్రీ తామన్ రచనలో గడుసైన పలుకుబడి ఉంటుంది. "వెలుగు చీకటుల పటము జీవనము", "ద్వైతముందునా దాంపత్యమ్మున". 'అద్వైతం సుఖదుఃఖయోః ' అనే భవభూతివాక్యం మనస్సులో తళుక్కు మంటుంది. రచనలో లయ అప్రయత్నంగా కుదురుకుంటుంది.

1) జయ జయ గంగే! జయ భాగీరథి!
జయ జయ రఘువర! జయ దాశరథే!

2) జానకీసౌమిత్రిసహిత రాఘవరామ!
జనకల్పభూరుహమ! స్నిగ్ధజలదశ్యామ!
ప్రాణోత్క్రమణవేళ నీదు నామోచ్చరణ
భాగీరథీతోయపర్యాయ మగు నాకు॥

శ్రీ తామన్ శబ్దచమత్కృతిని కించిత్తుగా ప్రవేశపెట్టి అరుదైన అందాన్ని చూపిస్తారు.

1) కదంబ చెప్పవె, వినావిలంబము
కంటివె సీతను నదీతటమ్మున?
కదులు తీరు రాయంచను మించును।

2) చందనమా! నీ చందమె నా సఖి.
నా పరిసరములు పరిమళించినవి.
నా జీవనమొక సారమరసినది॥

మరీ క్లుప్తంగా వాక్యంలో మెరుపు తెస్తారు :

ఎంతగా ఆకొనెనో జాబిలి
ఇటు చకోరము కడకు వచ్చెను॥

భారతీయాత్మకు సహజమైన వేదాంతబోధపటువై పొడిపొడి పదాల్లో వడిగా సాగుతుంది.

1) జరామృత్యువుల కతీతమా ఈ
సకలజీవజగతి?
వ్యథారహితుడగు నరుని పేర్కొనుము,
అతని కిడుదు ప్రణుతి.
పథములు సర్వము నిరయపథమ్ములు;
పయనము నిష్ఫలము.



2) జన్మమృత్యువులు సహోదరములను
సత్యమెరుగదగును
అగుపించే అనిపించేదంతయు
ఆభాసమెయగును,
కుందుటేలనో? శ్రేయము నరునకు
అందరాని నభము.

కొన్ని పంక్తులు మనస్సులో నిలిచిపోతాయి. సీతాదేవిని అశోకవనంలో హనుమంతునకు ఇలా అగుపించింది.

1) మలిన వసనాన వెలుగును
శంపాలత
2) మతికిరానట్టి ఒక దివ్య
మంత్రముగతి
3) సాంద్రశిశిరాన చాంపేయ
ద్రుమశాఖిక

శ్రీరాముడు సీత నుద్దేశించి మాటాడిన నాలుగు చిన్నవాక్యాల్లో అతిభయంకరమైన అనుమానం దాగి ఉన్నట్లు సూచించిన విధం ఇలా ఉన్నది.

నీవు నిరుపమచారుగాత్రవు;
నింద్యచరితుడు యాతుధానుడు.
వాని నెలవున దీర్ఘవాసము
వలయునా? ఇక విపులభాష్యము?

పరహితోక్తిని ప్రస్తావించిన పద్ధతి ఇలా ఉన్నది!

అలుక నూని రేని జనులు
నిలువగలదె క్షణము ప్రభుత?
ప్రజాహృదయ మెరుగుటయే
ప్రభుని ప్రథమకర్తవ్యము

ఇట్లా వాక్యాలు అప్రయత్నంగా అమరిపోతాయి. శ్రీ తామన్ మహారాష్ట్ర

ప్రాంతంలో దీర్ఘకాలం ఉన్నందున, ఆ భాషాప్రభావం వారి తెలుగుపై ప్రబలంగా కన్పిస్తుంది. ఉదాహరణకు, కొన్ని పంక్తులను వ్రాస్తున్నాను.

1) నను సాకేతకు మరల్చు యత్నము
నభోదోహనమ్ము.

ఇట్లాంటి పదబంధం తెలుగులో అరుదు.

2) వంచిన మరు నిమిషమ్మే దానికి
బలు దెవ్వడు ప్రత్యంచను పూన్చును?

ఇది కూడా అరుదైన ప్రయోగమే.

3) నిన్నటి వీరుని నీడవు సంప్రతి

'సంప్రతి', అందని ఆకాశం అనే అర్థంలో 'అందరాని నభము' తెలుగులో సాధారణంగా ప్రయుక్తాలు కావు.

4) అభిఘాతినివి కాక మాతవా?

ఇది కూడా మరాఠీ పదబంధంగా ధ్వనిస్తుంది. ఇట్లాంటివి ప్రాచుర్యం పొందడానికి కొంతకాలం పడుతుంది.

శ్రీ తామన్ ప్రయత్నం గొప్పది. మరాఠీమూలం లోని సొగసును సంపూర్ణంగా తెలిసిన విమర్శకముఖ్యుడు కావడం మూలాన, దాన్ని తెలుగులో అవతరింప జేయా లన్న ఆయన తపన సాకేత రామాయణంలో స్పష్టంగా కన్పిస్తుంది. శ్రీ తామన్ వంటి వారు కాక మరెవ రీ ప్రయత్నం చేయగల సమర్థులు? అందుకే ఇదొక విశిష్టకృతి అన్నాను.

ఎన్ని భాషలు? ఎన్ని జాతులు?
ఎన్ని జనపద పత్తనమ్ములు?
ఎత్తు నీరాజనము రఘునకు!
ఏల వలయును సాక్ష్యమిందుకు?

కావ్యమై పలుమార్లు వెలిసిన, నవ్యమే ఈ రామచరితము.

శ్రీ తామన్ ధన్యులు.



**డా. గండ్ర లక్ష్మణ రావు**
విశ్రాంత రీడర్, తెలుగుశాఖ

'శ్రీకాంత'
# 10-3-363,
వివేకానందపురి,
**కరీంనగర్** - 505001
ఫోన్. 0878-2229980
98493 28036

# తెలుగుకోయిల

**ఈ** సాకేత రామాయణం మన తెలుగులో వెలువడిన మరొక రామాయణం.

మఱల నిదేల రామాయణం బన్నచో,
నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
తినుచున్న అన్నమే తినుచున్న దిన్నాళ్ళు
తన రుచి బ్రతుకులు తనవి గాన.
చేసిన సంసారమే చేయుచు నున్నది
తన దైన యనుభూతి తనది గాన.
తలచిన రాముని తలచెద నేనును
నా భక్తిరచనలు నావి గాన.

అని రామాయణకల్పవృక్షంలో విశ్వనాథ చెప్పిన సమాధానం నేటికీ ఏనాటికీ వర్తిస్తుంది. మానవజీవన మున్నంత కాలం రామాయణ ముంటుంది. గిరులు, ఝరులు,సూర్యచంద్రాదు లున్నంత కాలం రామాయణ ముంటూనే ఉంటుంది. అంతే కాదు; నిత్యనూతనంగా తోస్తుంది. అది రామకథ లోని మహత్తు; మాధుర్యం.

ఆ రామకథామాధుర్యాన్ని సాకేత రామాయణం పేరుతో శ్రీ గజానన్ తామన్ గారు గేయరూపంలో పంచిపెడుతున్నారు. గజానన్ తామన్ తెలుగు, సంస్కృతం తోపాటు ఆంగ్లభాషలో ఆచార్యులు. మరాఠీభాషలో పండితుడు. ఈ బహుభాషా పాండిత్యం తెలుగువారికి రామాయణాన్ని సరికొత్త రూపంలో అందించడానికి సహకరించింది. **మానస సరోవరం** కవితా సంకలనంతో తెలుగు సాహితీ ప్రపంచంలో ప్రశంస లందు కున్న గజానన్ తామన్ తనకు చిన్ననాటి నుండి రామకథాశ్రవణం

వల్ల కలిగిన ప్రభావం, తన స్వగ్రామం 'చాకే పల్లి' సాకేతపదభ్రష్టంగా కవి భావించడం, మరాఠీలో శ్రీ గజానన్ మాడ్కూళర్ రచించిన రామాయణం గేయకావ్యాన్ని అనేకమార్లు వినడం వీటన్నిటి చేత ప్రభావితుడు కావడం వల్ల ఆయన హృదయం రామమయ మయింది. ఫలితంగా, మరాఠీ గేయ రామాయణం తెలుగు గేయ రామాయణంగా ఆయన హృదయం నుండి వెలువడింది. ఇది అనువాదం కాదు అనుసృజనం అని చెప్పుకోవడం వల్ల కేవలఛాయామాత్రానుసరణమే అయి ఉంటుంది.

సాకేత రామాయణం అని పేరుపెట్టడంలో తన పుట్టిన ఊరి ప్రభావం కూడా ఉంది. ఈ రచనలో ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడా అయోధ్య అని రాదు. వీలయి నన్ని సార్లు సాకేతం అనే పేరు ప్రయోగించారు. ఇది ఆయన పుట్టిన మట్టి పై గల అభిమానానికి తార్కాణం.

ఈ రామాయణం గేయరూపంలో ఉంది. ఇది ప్రక్రియాభేదమే కాక మరో విలక్షణత కూడా ఇందులో ఉంది. గతంలో తెలుగులో పద్య, ద్విపద, గేయరూప రామాయణాలెన్నో వచ్చినాయి. జానపదులు, స్త్రీలు, చిందు, చిఋతలవారు అనేక రూపాలలో రామకథను పాడడం ఉంది. ఈ రామాయణంలో కథ నంతా పాత్రలే నడిపించడం విశేషం. ఆ యా పాత్రలు ఒక గేయాన్ని పాడతాయి లేక వినిపిస్తాయి. ఏ పాత్ర కా పాత్ర స్వభావం ఏ మాత్రం భంగం కలుగకుండా కథలో ప్రధాన సన్నివేశాలు వదలకుండా, కథంతా అలలు అలలుగా సాగి పోతుంది. రామాయణంలోని పాత్రలన్నీ ప్రజల రక్తదఘ్న మైనవి. ఏ మాత్రం తేడా వచ్చినా పాఠకులు సహించరు. అందువల్ల కవి స్వయంసృజన చేసినా మూలానికి భంగం కాకుండా జాగ్రత్త పడినాడు. ఉదాహరణకు రామాయణంలో ప్రధానపాత్రలు గాక విలక్షణ మైన పాత్రలు కైకేయి, మందోదరి, తాత్కాలికంగా కనిపించే పాత్రలు గుహుడు, శబరి, జటాయువు వారి స్వభావాలు కథాగమనంలో వాటి భాగస్వామ్యం ఆ పాత్రల గేయంలోనే తెలియాలి. తమను తాము చెప్పుకునే స్థితిలో ఎక్కడా అంతస్సూత్రంగా ఉన్న రామకథాధర్మసూత్రం దెబ్బతినగూడదు. ఒక విధంగా ప్రతి పాత్ర ఆత్మాశ్రయంగా కథలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, కథాగమనానికి కవి పాత్రను కూడా పరోక్షంగా నిర్వహించడం విలక్షణం.

ప్రధానంగా కథలోని పాత్రలు గాక కవి మధ్యలో ఎక్కడా ప్రయోక్త గా



వ్యవహరించక పోవడం కూడా ఇందులో విశేషం. 'నివేదకుడు' పేరుతో ఒకటి రెండు చోట్ల కనిపిస్తాడు. సాకేతపురిప్రజలు పురుషులు, స్త్రీలు కలిసీ, విడివిడిగా మాట్లాడుకునే సన్నివేశాలు గేయాలుగా రూపొందినాయి. ఇవి తప్ప దాదాపు రామాయణంలోని ప్రధాన పాత్రలే కాక విశిష్టమైన పాత్రలు సన్నివేశాలు ఇందులో కనిపిస్తాయి. త్రిజట, ఇంద్రజిత్తు, ఇట్లాంటివి కొన్ని విడిగా కనిపించవు.

శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు, హనుమంతుడు ఈ పాత్రలు రెండు సార్లు అంత కన్నా ఎక్కువగా కన్పిస్తారు. మిగతా పాత్రలన్నీ కేవలం ఒకే సారి తమ గేయాన్ని వినిపించి నిష్క్రమిస్తాయి. ఇది ఒక శ్రవ్యరూపకమే కాదు దృశ్యరూపకంగా కూడా ప్రదర్శించే అవకాశముంది. ఏ పాత్ర కా పాత్ర ప్రవేశించి నిష్క్రమించటమే కాని ఎదురుబడి సంభాషణలు, వాదనలు జరపడం లేకపోవడం ఈ రూపకం ప్రత్యేకత. ఇది ఒక సరికొత్త రూపకవిధానం అనాలి. ఈ విధానాన్ని మరాఠీ కవి ప్రవేశ పెట్టినా, తెలుగులో అంత సహజంగా దాన్ని రూపు కట్టించిన గజానన్ గారి కృషి ప్రశంసనీయం.

ఒక విధంగా ఇది గేయరూపకదృశ్యకావ్యంగా కూడా భావించవచ్చు. శ్రవ్యకావ్యంగా సామాన్యులను కూడా రంజింప జేయ గలుగుతుంది.

వాల్మీకిమనోభావవీచికలు సీతారాముల రూపంలో ఉన్న కుశలవుల గానంగా కథ ప్రారంభమవుతుంది. ప్రారంభాంతములలోను అక్కడక్కడా కూడా వాల్మీకి అనుసరణం ఉంది. కొన్ని నూతనకల్పనలూ ఉన్నాయి.

వ్యంగ్యమూ, ధ్వనిగర్భితమూ అయిన వ్యక్తీకరణ లున్నాయి. ఉదాహరణకు సాకేతపురాన్ని వర్ణిస్తూ

'ఆ పట్టణ పరిణాహపరిధిలో
అంబర మంటే హర్మ్యము లెన్నో
అతి సరళమ్ములు రాజపథమ్ములు
యాతాయాతము దివారాత్రములు
అలజడి నదినే సుమా' ..... అంటారు. ముగింపులో అలజడి నదిలో ఉందని చెప్పడంలో ఆ నగరం సమీపాన ఒక నది ఉన్నదనీ, ఆ

నదిలో ప్రవాహం సవ్వడి ఉన్నదనీ, నగరంలో ఎంత యాతాయాతజనం ఉన్నప్పటికీ ప్రశాంతంగా ఉందనీ ధ్వనింపజేశారు.

అట్లే, 'ఆమ్రతరువు పుష్పించ దేమిటికి, ఆమని వచ్చి చనినా..' అన్న దాంట్లో దశరథునకు సంతానం కలుగ లేదనీ, దేవపితృశుభయోగం అన్న ప్రయోగంలో దేవతలు దశరథునికి సంతానం కాబోతున్నారని, శ్రుతులు పారాడును ఇంట, జీవనపటం చతురస్రం ... ఇంకా ఇట్లాంటి ప్రయోగాలెన్నో కవిత్వవ్యక్తీకరణలో పరిణతిని పట్టిస్తున్నాయి.

కైకేయి దశరథుని వరాలు కోరేముందు మాట్లాడిన మాటల్లో
"కడుపుతీపి ఏ ప్రాణి యెరుంగదు?
కడు సహజమె ఇది కఠినునికైనను.
అంధు లగుదురే యంత మాత్రమున?
అవధరించు నాథ !"

అంటుంది. ఇందులో కడుపుతీపి తనకు, దశరథునకు ఇద్దరికి వర్తించే మాట, ఆ తీపి పేరుతో గుడ్డిగా బిడ్డలను ప్రేమించి వారి ఉజ్జ్వలభవిష్యత్తును పట్టించుకోక పోవడం న్యాయమా? అనే ప్రశ్న ఉంది. అంటే రాముడు మహత్తరకార్యాలు చేయవలసి ఉండగా కేవలం ప్రేమనెపంతో అడవికి పంపకపోవడం మంచిది కాదనే సూచన ఉంది. సీతను అగ్నిప్రవేశం కోరిన రాముడు తన మనసులోని అభిప్రాయాన్ని చాలా సుకుమారంగా, పరోక్షంగా వ్యక్తం చేయడం అద్భుతమైన వ్యక్తీకరణ. శబరి తాను కొరికి చూసి రాముని కిచ్చిన ఫలాల వంక లక్ష్మణుడు అనుమానంతో చూడడం, ఇవి ' భుక్త శేషము కావు ఫలములు, పూతమివి అభిమంత్రితమ్ములు, అని చెప్పడం నిరంతరం త్రికరణశుద్ధిగా రామనామజపం చేసిన నోరుకదా అని ధ్వని ఉంది.

ఇట్లా ఆ యా పాత్రల లోతులను తెలిపే మాటలు కూడా ఉన్నాయి. ఇవి సామాన్య మైన భాషలో ఉండడం మరో విశేషం. ఎక్కడా పెద్ద సమాసాలు గాని పొదగ కుండానే గొప్ప అర్థాలు ధ్వనింప చేయడం భాష నాడిని తెలిసిన కవి మాత్రమే చేయగలడు.



అహల్య శిల నుండి స్వస్వరూపానికి మారిన తీరు, ఇంద్రియజ్ఞానం క్రమంగా కలిగిన తీరు చక్కగా వర్ణించారు. ఆమెయే తన మాటల్లో చెపుతుంది :

"కన్నుదోయికి కాంతి యబ్బెను
వినునదయ్యెను కర్ణయుగ్మము
క్వణనరుతవాగ్విలసనమ్ముల
లే అహల్యా ! అనె దయాళువు
లేచి కనగా నీవ మ్రోలన!
"నీదు పదముల స్పర్శనెరిగెను ......"

ఇట్లా కాంతి, ధ్వని, స్పర్శ మొదలైన ఇంద్రియజ్ఞానం కలిగి నట్లుగా వర్ణించడం విశ్వనాథ కల్పవృక్షంలో, "ప్రభు మేనిపై గాలి పైవచ్చి నంతనే, పాషాణ మొకటికి స్పర్శవచ్చె.".. అన్న పద్యాన్ని స్ఫురింపజేస్తుంది. ఇందులో క్వణనం వీణానాదం, రుతం పక్షుల కూజితం, వాక్కు, మానవుల స్వరం ఈ మూడింటి విలసనంతో రాముడు "లే అహల్యా!" అన్నాడు. వీణ దేవతలకు, రుతం తిర్యక్కులకు, మాట మానవులకు ఈవిధంగా త్రిమూర్త్యాత్మకత, త్రిగుణాత్మకత, త్రిలోకాత్మకత రాముని పిలుపులో ధ్వనించడం కవి ధ్యానభూమికలో పుట్టిన భావన.

మాయలేడిని చూసి సీత ఆ లేడిని ఎట్లయినా తనకు పట్టి తెచ్చి ఇమ్మని అడుగుతుంది. ఆ లేడిని ప్రాణాల తోనే తీసుకొని రమ్మంటూ, ఆ లేడిని సాకేతకు తీసుకొని పోదా మంటుంది. సాకేతకు తీసుకొని వెళదామనేది ఈ కవి కల్పన. ఒక అల్పప్రాణి అందంగా ఉందని మోహించి నంత మాత్రాన దాన్ని చంపడానికి బదులు పోషిస్తూ ఆ అందాన్ని పలువురికి పంచడంలో ఒక ఉదాత్తతను, నవ్యతను చేకూర్చారు.

ఒక్కొక్క పాత్ర ఆలపించిన గేయం ఒక్కొక్క గతిలో సాగుతుంది. గేయాలన్ని దేశిచ్ఛందంలో ఉన్నాయి. సామాన్యజనులు పాడుకునే అనేక పాటలకు దగ్గరగా ఉండే ఈ గేయా లన్ని రగడల రూపాలు: హయప్రచారగతి, మధురగతి,హరిణగతి మొదలైనవి. మాత్రాచ్ఛందస్సులో త్రిశ్ర, చతురశ్ర, మిశ్రగతి, ఖండగతి మొదలైన అనేకరూపాలలో ఉన్నాయి. ఆయా సన్నివేశాన్ని బట్టి పాత్రస్వభావాన్ని బట్టి గేయాల నడకలు, అక్షర పద సమాసాల నెన్నుకోవడం కవి పాండిత్యానికి, ప్రతిభకు, ఔచిత్యానికి దర్పణంగా ఉన్నాయి.

కౌసల్య రామచంద్రుని గురించి మురిపెంతో పాడిన గేయం.

"నల్లవాడే రామచంద్రుడు ...." అనే ఎత్తుగడతో పది చరణాల వరకు సాగింది. ప్రతి చరణంలో రాముని గుణగణాలు అందంగా ఒక తెలుగుతల్లి తన బిడ్డకు జోలపాట పాడి నంత మధురంగా ఈ గేయం సాగింది. ప్రతి చరణం 'నల్లవాడే రామచంద్రుడు' అని మొదలవుతుంది. ఈ గేయం 3+4, 3+4 మాత్రల గతిలో సాగి ఒక చక్కని లయ సాధింపబడింది.

నల్ల వాడే రామ చంద్రుడు

(3+4) + (3+4) = 14 మాత్రల ఈ నడక ముత్యాల సరాన్ని పోలి ఉంటుంది. రగడల్లో ఇది హరిణగతి.

మాయలేడిని చూసి సీత పలికిన పలుకులు ఎంత సుకుమారంగా లలితంగా ఉన్నాయో, ఆ గేయం నడక ఎంత రమణీయంగా ఉందంటే ఆ లేడి సొగసులు గేయం నడకలో కూడా తొంగి చూస్తున్నట్లుగా ఉన్నాయి.

ఆర్య! పూల నేరు వేళ
అరసితి నొక లేడిని
ఏగి వేగ దాని తెచ్చి

ఎదకు గూర్చు హాయిని......... ఇందులో మొదటి పాదంలో 12 మాత్రలు , తరువాతి పాదంలో 10 మాత్రలతో గేయం సాగింది. అంటే వేగంగా వెళ్ళి చటుక్కున పట్టుకోవడం, లేడి ఉన్నట్టుండి ఒక్కసారి గంతేసి ఆగిపోవడం ఇట్లాంటివి పరోక్షంగా కనిపింపజేసే దృశ్యాలు ఈ నడకవల్ల సాధించాడు కవి. ఆర్య, పూల, నేరు, వేళ ఈ పదాలన్నీ మూడేసి మాత్రల నిడివి గలవి. ఇది జానపదాల్లోని ఒక షట్పది. రగడల్లో హయప్రచార.

ఇట్లా సన్నివేశానుగుణమైన నడకల నెంచు కోవడం గొప్ప ఔచిత్యం.

కదంబచెప్పవె, వినావిలంబము జగణప్లుతము లైన మాటలతో ఉత్కంత, ఎగసిపడే ఆవేదన స్పష్టమవుతాయి. ఇది పాత్రహృదయాన్ని పట్టి యిచ్చే నడక. చాలా గేయాలు అలతి అలతి పదాలతో సాగి సరళంగా మృదుమధురంగా పాడుకోవడానికి యోగ్యంగా కూర్చబడినాయి. సమాసాలకు ఈ రగడల్లో అవకాశం



తక్కువ. అయినా పాత్ర తీరును బట్టి ప్రయోగించారు. తాటకిని గురించి చెపుతూ

అతులబలగర్విత;
ఆర్షజనతర్జిత ;
క్రవ్యాద, కుఖ్యాత;

రాత్రించరి.......... అంటారు. ఇందులో కకార, తకార పరుషాక్షరాలతో పాటు రేఫము పదే పదే ఆవృత్తి అయి రౌద్రం ధ్వనిస్తుంది.

శ్రీరాముడు భరతునికి అడవిలో చేసిన బోధ ఒక భగవద్గీతసారాంశంలా సాగుతుంది. 'తల్లి తప్పిదమ? తండ్రి దోషమా? తగదు నిర్ణయించ' అని మొదలైన ఈ గేయమంతా కర్మప్రబోధం చేసిన తీరు తలమానికంగా ఉంది.
ఇంకా అచ్చమైన తెలుగు పలుకుబడులు కూడా రాశి పోశారు.

పేగుబంధం, రామచక్కదనపు గిత్త, అయ్యామాట, అవ్వ బువ్వ, అత్తపుత్తలు ఇట్లాంటి వెన్నో సందర్భానుసారంగా ఒదిగి పోయాయి.

గేయాల ఎత్తుగడలు, ముగింపులు నడకల దృష్ట్యా, భావాల దృష్ట్యా, కథా గమనం దృష్ట్యా ఎంతో వైవిధ్యాన్ని సంతరించుకొని రామాయణమహాకావ్యం ఔన్నత్యాన్ని నిలబెట్టాయి.

ఎత్తుమీ కార్ముకం.
ఏయుమీ సాయకం.
కూల్చు ఈ తాటకను,

కోసలేంద్ర! .. ఇందులోని ఎత్తుగడ నడక రగణాలతో ఉండి; ధనుస్సును ఎక్కుపెట్టడానికి తగిన ప్రోత్సాహాన్ని శబ్దమే కలిగిస్తు న్నట్లున్నది.

మలినవసనాన వెలుగీను
శంపాలత.
సవనదేశానసందీప్త

స్వాహాసతి .. ఈ గేయంలో మూడు పదాలతో ఎత్తుకొని ఒక పదంతో రెండవభాగంగా ముగించారు. పై పదాలలో ఆమె వైభవం అత్యున్నతం, క్రింది మాటలో ప్రస్తుతస్థితి దైన్యం స్పష్టం చేయడమే ఈ గేయనిర్మాణ రహస్యం. ఇటువంటి

వెన్నో ఆయా సందర్భాలలో వైవిధ్యభరితమైన నిర్మాణాలున్నాయి. ఇదంతా కవిత్వంలోని శిల్పం.

రామాయణకథలో సహజమానవధర్మాలను చిత్రించడం తో పాటు వర్తమాన రాజకీయాలపై వ్యంగ్యంగా, పరోక్షంగా, హితోక్తులుగా పలికించిన మాటలు కవి సమకాలీనదృష్టికి నిదర్శనాలు. కుంభకర్ణుని వంటివాడు యుద్ధానికి వెళ్ళే ముందు

'ఇది అనయమ! ఇది నయమా!
ఇదియ సర్వజనహితమా?
వివేచించి విబుధసమితి
విధుల దవిలితే?' అంటాడు. రాజుల కాల మైనా, ప్రజారాజుల కాల మైనా ఏలికలు విధిని సక్రమంగా నిర్వహించకపోతే దేశం నాశన మవుతుందనే హితవు ఉంది.

సీతను అగ్నిప్రవేశం కోరే ముందు శ్రీరాముడు, ప్రజావాణి, దైవవాణి, ప్రజలె పరమదైవతములు అంటూ ప్రజాభిప్రాయానికి ప్రథమతాంబుల మిచ్చాడు.

పట్టాభిషేకానికి ముందు సాకేతపురవాసులు శ్రీరాముడు ప్రభువై నంతనే కాదు తాను ఏర్పాటు చేసే మంత్రిమండలి కూడా తన వలె స్వచ్ఛమైనవారు కావాలి అని అభిప్రాయపడినారు. మంత్రిమండలి చంద్రునిలో మచ్చ వలె కూడా లోపభూయిష్టమైనదిగా ఉండరాదని అర్థం. ఇది ఈనాటి మంత్రిమండలికి కవి అంటించిన చురక.

మంచి గాయకులు వీటిని గానం చేసినట్లయితే కుశలవులు గానం చేస్తే సాకేతపురప్రజలు, మహర్షులు, సాక్షాత్తు శ్రీరామచంద్రుడు విని పరవశించినట్లు మనం కూడా రామకథాలహరిలో మునిగితేలవచ్చు.

శ్రీ గజానన్ తామన్ గారు ఈ గేయరామాయణం రచించి ధన్యులయినారు. ఈ కవి తెలుగుపల్లె చాకేపల్లిలో పుట్టి కొంతకాలం గడిపినా, తరువాత కొంతకాలం మంథనిలో బాల్యజీవితం గడిపినా, తరువాత జీవితంలో నాలుగుదశాబ్దాలు



మహారాష్ట్రలో ఉద్యోగ రీత్యా స్థిరపడినారు. తెలుగుకు, తెలుగు ప్రజలకు దూరమై కూడా తిరిగి తెలుగులో కవిత్వం రాయడమే కాదు ఏకంగా రామాయణాన్ని కలకూజితంగా వినిపించారు. అచ్చమైన తెలుగుకోయిల గా రామాయణాన్ని వినిపిస్తున్నారు. 'కూజంతం రామ రామేతి, వందే వాల్మీకి కోకిలం', అన్నట్లు వందే తెలుగుకోకిలం అనుకోవాలి. అది శ్రీరాముని కటాక్షంగా భావించే శ్రీ గజానన్ తామన్ గారు తనకు తల్లిదండ్రులతో సమానమైన పుణ్యదంపతులు, శ్రీ గట్టు నారాయణ గురూజీ గారి జననీజనకులైన శ్రీగట్టు రామన్న గట్టు సీతమ్మగారలకు అంకిత మివ్వడం సీతారామకథ సీతారాములకే అర్పించి ఋణవిముక్తుడు కావడం యాదృచ్ఛిక మైనా సముచితమే కదా! మంథెన్న ద్విజులు అటు కాశ్మీరంనుండి ఇటు దక్షిణదేశం దాకా ప్రసిద్ధి పొందిన వారని చరిత్ర చెపుతుంది. ఇంకా ఆనవాళ్లున్నాయి : శ్రీ గట్టునారాయణ గురూజీ గారు, గజానన్ తామన్ వంటి వారు.

ఆర్షధర్మాన్ని సరళంగా, విపులంగా ఈ తరం వారి కంద జేయడానికి యోగసూత్రాలు, శివసహస్రనామాలు, నారదభక్తిసూత్రాలు మొదలయిన వాటికి వ్యాఖ్యానాలతో పాటు తెలుగుసేత చేసి అందంగా ముద్రించి అంద జేస్తున్న పూజ్య గురువులు శ్రీ గట్టు నారాయణగారు ఈ రామాయణం ముద్రణ చేపట్టి నందుకు కవిగారి పక్షాన్నే గాక పాఠకుల పక్షాన వారికి అనేకానేకనమస్సులు.

'సీతారామసేవాసదన్' పేరుతో సంస్థ ఏర్పాటు చేసి ఎన్ని పనులు చేసినా రామకార్యం చేయకపోతే అసంపూర్ణం కదా! ఈ రామాయణంతో సేవాసదన్ సార్థకతను పొందిందని భావిస్తూ, నిర్వాహకులకు కూడా నమస్సులు.

అభిమానంతో, ఆప్యాయతతో ఈ రామాయణం పై నాలుగు మాటలు రాసే అవకాశం కలిగించిన కవి శ్రీ గజానన్ తామన్‌గారికి నమ:పూర్వకధన్యవాదములు.

నవ్యలా ఈ సూర్య చంద్రులు
నవ్యమా ఈ తారకావళి?
కావ్యమై పలుమార్లు వెలసిన
నవ్యమే ఈ రామ చరితము.

# మనోగతం

**నా** ఊరు సాకేతపల్లి. ప్రజల వ్యవహారంలో, ప్రభుత్వ వ్యవహారంలో, ఇది చాకేపల్లి. రాము దేలిన దండకారణ్యఖండంగా మద్గురువర్యులు స్వర్గీయ సేనాపతి రామాచార్య గారు అభివర్ణించిన ఆదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లి మండలానికి చెందిన గ్రామం.

ఈ చాకేపల్లి నా పితామహుడైన స్వర్గీయ వెంకట రాజన్న గారికి మఖ్తాగా నిజాం సర్కారు నుండి ప్రాప్తించింది. హిందీ, మరాఠీ, ఆంగ్లభాషల్లో ఉల్లేఖనీయ వైదుష్యం సంపాదించిన ఆయన ఒక ఆలయాన్ని నిర్మించి, అణిమాదిసిద్ధులను కైవసం చేసికొన్న మహామహుడు శ్రీ గోపాలమయ్య ఒసంగిన శ్రీ సీతాలక్ష్మణ సమేతరామవిగ్రహాల్ని అందులో ప్రతిష్ఠితం చేశాడు. ఇహలోకయాత్ర చాలించేంత వరకు పూజార్చనలు చేశాడు. ఇది 1918 నాటిమాట. ఆయన బిలాస్‌పూర్ మధ్యప్రదేశ్‌లో చేస్తున్న ప్రభుత్వోద్యోగానికి రాజీనామ సమర్పించి, తన ఏకైకపుత్రుడైన మా దాదగారితో చాకేపల్లిని తన స్థిరనివాసము చేసికొనినాడు.

ఆయన అనంతరం, ఆయన కుమారులు మా దాదగారైన స్వర్గీయ గుణవంతరావు వార్ధక్యం పైబడే వరకు శ్రీరామసేవలో ఉన్నారు. ఆయన అనుపస్థితిలో మా పితామహి స్వర్గీయ రాధమ్మ అర్చనాకార్యం నిర్వహించేది. ఆయమ కాలధర్మం చెందాక పూజావిధులను నిర్వహించటంతో పాటు మా ఆయి స్వర్గీయ రాధాబాయి తన స్వీయధనంతో ఆలయాన్ని పునర్నిర్మింపజేసింది. సీతారామ కళ్యాణం ప్రతి సంవత్సరం జరిపే నిమిత్తం మా తమ్ముడైన స్వర్గీయ ధనంజయ్ కుమారుడు చి॥ దిలీప్ భవ్యమంటపాన్ని కట్టించినాడు. మా సహోదరులు చి॥ శ్యామసుందర్, స్వర్గీయ మనోహర్ ఈ ఆలయానికి భూవసతిని కల్పించి ధన్యులైనారు. ఇంతగా ప్రపంచించటానికి కారణం, సాకేతపతి మా ఆరాధ్యదైవమని చెప్పుటకే!

కీ.శే. ముద్దు బాలంభట్టు రచించిన మంథెన రామాయణం మా దాద గారు కర్ణపేయంగా పాడేవారు. మేల్కొన్న వెంటనే మా నాయనమ్మ తులసీకృత రామాయణంలోని కొన్ని 'దోహాలు' చదివేది. ఇలా నా బాల్య కౌమారదశలను



రామకథాపరీమళాలు ప్రత్యూషపవనాల వలె పై కొన్నవి.

నా కర్మభూమి మహారాష్ట్రలో వాస్తవ్యం చేసిన నలభైఏళ్ళలో మహాకవి గజానన్ మాడ్గూళ్కర్ గీత్ రామాయణ్‌ను గానగంధర్వు డైన సుధీర్‌ఫడ్కే నుండి క్యాసెట్ల ద్వారా పలుమార్లు విని శ్రీరామచరితానికి మరీ చేరువయ్యాను. ఇలాంటి గేయరామాయణాన్ని తెలుగులో వ్రాయాలని ఆ రోజులలో మనస్సులో సంకల్పించుకున్నాను. 2004లో మొదలైన నా కృషి 2008 సమాప్తి నాటికి సుసంపన్నమైంది.

నా బాల్యకౌమారదశలు మాతామహుడు సువర్ణ కృష్ణయ్య గ్రామం మంథనిలో గడిచింది. ఆ గ్రామంలోని మందాట అనే వీధిలో స్వర్గీయ గట్టు రామన్న గారి ఇల్లు ఉంది. ఇది ఇంగ్లీషు వారి మాటల్లో చెప్పాలంటే, నాకు సెకండ్ హోమ్. వారి కుమారులైన రాధాకృష్ణ, నారాయణలు నాకు ప్రాణస్నేహితులయ్యారు. 'చింతచెట్టు' కవిత వ్రాసిన వారి చెల్లెలు విదుషీమణి సుమతి నన్ను ఎంతగానో అభిమానించేది. స్మితపూర్వభాషిణియైన వారి తల్లి సీతమ్మ గారు తన పిల్లలలో ఒకనిగా నన్ను చూసేది.

నేను ప్రాచార్యునిగా సేవానివృత్తుడనై నాందేడు వదలి కరీంనగరంలోని మంథనిలో స్థిరపడ్డాక శ్రీ గట్టు నారాయణతో గల స్నేహబంధం మరింత దృఢ పడింది. ఆయన రచించిన శతాధికగ్రంథాల నుండి నాలుగింటిని ఎన్నుకొని అనువదించగా శ్రీ సీతారామ సేవాసదన్ ప్రచురించింది. ఈ అనువాదాలనే కాకుండా నా కావ్యం 'మానస సరోవరం'ను 2004 లో మొదటిసారి, 2006లో రెండవసారి ముద్రించి ప్రచురించింది. ఈ కావ్యానికి డా॥ వి.వి.ఎల్. నరసింహారావు గారు 'హంసధ్వని'ని చేర్చారు.

1996లో అజ్ఞాత వ్యక్తినైన నాకు మాన్యశ్రీ గట్టు నారాయణ గురూజీ గారి సౌహార్దం వల్ల తెలుగుదేశం లోని అనేక మంది బుద్ధిజీవులతో పరిచయభాగ్యం లభించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రంగ ప్రముఖులతో పాటు శ్రీభాష్యం విజయసారథి

వారిచే, డా॥ సోమసుందర్ పిఠాపురం వారిచే సన్మానింపబడటం మహద్భాగ్యంగా తలుస్తాను.

ఈ వేళ నా ఎడవల్ల మాలిన వాత్సలం కనబరచిన స్వర్గీయ ఉత్పలవారిని, స్వర్గీయ డా॥ పేర్వారం వారిని సంస్మరించుకుంటున్నాను. కంటికి రెప్పగా నన్ను కాపాడిన నా మాతామహి సువర్ణ లక్ష్మీబాయిని గుర్తుకు తెచ్చుకుంటున్నాను. సాహితీ క్షేత్రంలో నా ప్రగతిని సదా కొనియాడి ప్రోత్సహించిన ప్రాణమిత్రులు స్వర్గీయ గీట్ల జనార్ధనరెడ్డిని సంస్మరించు కొనడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.

రచనాకాలంలో సందేహనివృత్తి కావిస్తూ, ఈ కావ్యానికి పీఠిక నందించిన విద్వన్మిత్రులు డా॥ శ్రీ లక్ష్మణమూర్తికి,

ఈ నా సాకేత రామాయణం కావ్యాన్ని ప్రచురిస్తున్న శ్రీ సీతారామసేవాసదన్ సంస్థాపకులైన మాన్యశ్రీ గట్టు నారాయణ గురూజీ గారికి, అధ్యక్షులైన శ్రీ సువర్ణ లక్ష్మణరావు గారికి,

ముద్రణకార్యాన్ని పర్యవేక్షించడంతో పాటు తమ అమూల్యమైన 'తెలుగు కోయిల'ను నా కావ్యానికి చేర్చి శోభాన్వితం చేసిన నాకు పరమాప్తులైన, సుప్రసిద్ధ విమర్శకులు డా॥ గంద్ర లక్ష్మణరావు గారికి,

నా హార్దిక కృతజ్ఞతలు తెలుపుకుంటూ,

విబుధజన విధేయుడు
**గజానన్ తామన్**

నివృత్త ప్రాచార్యుడు
తమ్మిచెరువుకట్ట వీధి
# 4-35,
**మంథని** - 505 184.
కరీంనగర్ (ఆం.ప్ర.)
సెల్: 0944211285





బాసరనివాసినీ! బహురమ్యరూపిణీ!
పద్మభవగేహినీ! వందనము లివిగో!

ఋగ్వేదవీథిలో, విహరించు వేళలో
ఈవే కదా వాణి! ఇటుల వచియించినది.

"ఏ నరుని పై నాకు కరుణ గలుగునొ వాని
నే నొనర్తును బ్రహ్మ, నే నొనర్తును ఋషిని".

ఏ మొనర్చితొ నన్ను ఇసుమంత నే నెరుగ;
ఎరుగుదును నే నన్న ఎంత వాత్సల్యమ్మొ.

సాహితీసౌరభస్పర్శ నెరుగని నేను
సాకేతపతిచరిత జగతి కర్పించితిని.

# సాకేత రామాయణం

## బాలకాండ

గజానన్ తామన్

# 1. నివేదకుడు

శ్రీరఘువర్యుడు తన్మయుడై విను
శిశువులు పాడగ రామాయణమును.

కుశలవు లిరువురు తుల్యవయస్కులు.
కోశలాధిపుని పోలు సుగాత్రులు.
జనకుని చరితము సుతులు వచించుట
ఇనతేజమునకు నీరాజనములు.

క్షాత్రతేజములు, మునులవేషములు.
గంధర్వులె పో తపోభూమిలో!
వాల్మీకి మనోభావవీచికలు
వటువుల రూపము దాల్చె నిశ్చయము.

ప్రతిభావైభవరసాలవనమున
రమ్యగీతికలు పాడే పికములు.
పసికందుల కలనాదములను విని
పరవశించు ఋతువుల దొర ఆమని.

సుమముల వలె ఆ పెదవులు విచ్చును.
సురభిళస్వరములు జగముల నూచును.
కర్ణభూషకుండలముల గతులకు
ఘనసంగతిగా వీణెలు తోచును.

**గజానన్ తామన్**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=590**